# అరుదైన ఒక అద్భుతం

రియల్ స్టోరీ

**కస్తూరి మురళీకృష్ణ**

"అమ్మా! దేవుడంటే ఎవరు? నాకు దేవుడిని చూపించవా?" మారాం చేయటం ఆరంభించింది మూడేళ్ల గ్రేస్.

ఏం చెప్పాలో, గ్రేస్‌ని ఎలా సముదాయించాలో తెలియటం లేదు లెస్లీ కెనడీకి. అంత చిన్న పిల్లలకు దేవుడనే భావాన్ని అర్థమయ్యేట్టు ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కావటం లేదు.

"నీ వద్ద దేవుడి ప్రసక్తి తెచ్చిందెవరమ్మా?" అడిగింది లెస్లీ, కూతురిని.

"నన్ను చూసినప్పుడల్లా దేవుడి గొప్పతనం గుర్తొస్తుందని నాన్నగారంటారు. ఇందాక కూడా నన్ను ముద్దుపెట్టుకుని ఇదే మాట చెప్పారు– నన్ను చూస్తే దేవుడి గొప్పతనం ఎందుకు గుర్తొస్తుందమ్మా?" అని చాలా అమాయకంగా అడిగింది గ్రేస్.



ప్రాణాపాయంలోంచి అద్భుతంగా బయటపడిన పసిపాప గ్రేస్

ప్రపంచాన్ని వింతగా చూసే ఆ అద్భుతమైన కళ్లల్లోకి చూస్తున్న లెస్లీ కెన్నెడీకి, ఆమె భర్త డీన్ కెన్నడీ మాటల అర్థం తెలుసు.

* * *

డిసెంబర్ 2001.

"మీకు పుట్టబోయే బిడ్డకు 'స్పినా బైఫిడా' (Spina bifida) అనే సమస్య ఉంది" మృదువుగా చెప్పింది డాక్టర్ వెస్‌వైర్. అమెరికాలో నార్త్ కరోలినాలోని 'చాపెల్ హిల్ మెడికల్ సెంటర్'లో ఫీటల్ థెరపీ ప్రోగ్రాం డైరెక్టర్ ఆమె.

బిడ్డ మాతృగర్భంలో పిండం రూపంలో ఉన్నప్పుడే పరీక్షలు చేసి, ఏవైనా లోపాలుంటే పిండ స్థాయిలోనే గుర్తించి, సవరించే ప్రయత్నాలు చేయటం ఈ ప్రోగ్రాం లక్ష్యం.

"స్పినా బైఫిడా అంటే?" ధైర్యం కూడదీసుకుని అడిగాడు డీన్.

"ఇది వివరించటం కాస్త కష్టం. కానీ ప్రయత్నిస్తాను. పిండం వెన్నుపూసలో ఉన్న కొన్ని టిష్యూలను 'డ్యూర'లంటారు. ఇవి వెన్నెముక నరాలను కప్పి ఉంచుతాయి. కానీ కొన్ని సందర్భాలలో ఈ టిష్యూలు వెన్నెముక నరాలను కప్పవు. అందువల్ల 'హైడ్రోసెఫాలస్' పరిస్థితి ఏర్పడుతుంది. అంటే నీరు వెన్నుపూస ద్వారా పిండం మెదడులోకి చేరుతుందన్నమాట. నీరు మెదడులో నిండుతుండటంతో మెదడు వెనక్కు నెట్టబడుతుంది. అలా మెదడు మెడవైపు నెట్టబడటం వల్ల వెన్నుపైన ఒత్తిడి పెరుగుతుంది. దీన్నే 'స్పినాఫైడ్' అంటారు. ఈ పరిస్థితి వల్ల పాప ఊపిరి పీల్చడం కష్టమవుతుంది. మింగటం కూడా సమస్య అవుతుంది. చాలామటుకు స్పినాఫైడ్ పిల్లలు గర్భంలోనే మరణిస్తారు. లేదా పుట్టిన కొద్దినెలల్లోనే ప్రాణాలు కోల్పోతారు" ఓపికగా వివరించింది డాక్టర్.

డీన్, లెస్లీలు ఒకరి చేయి మరొకరు గట్టిగా పట్టుకున్నారు.

"అంటే ఇప్పుడు మా పాప బతకటం కష్టమా?" అడిగింది లెస్లీ.

"దాదాపుగా మనం ఆశలు వదులుకోవలసిందే. కానీ ప్రస్తుతం పరిశోధన స్థాయిలో ఓ ఆపరేషన్ జరుపుతున్నాం. ఇప్పటికి 225 మంది 'స్పినాఫైడ్' పిల్లలకు ఈ ఆపరేషన్ జరిగింది. ఫలితాలు ఇంకా సరిగ్గా నిర్ణయం కాలేదు" చెప్పింది డాక్టర్.

"ఈ ఆపరేషన్‌లో ఏం చేస్తారు?" అడిగింది లెస్లీ.

"ఆపరేషన్‌లో ముందుగా మాతృగర్భాన్ని తెరుస్తాం. శిశువు వెన్నుపూసలో ఉన్న లోపాన్ని సరిచేస్తాం. ఇందువల్ల శిశువు మెదడులోకి నీరు చేరటం ఆగిపోతుంది. మెదడులో చేరిన నీటిని తొలగిస్తాం. దాంతో ఇక చివరి మూడు నెలల్లోనయినా మెదడులోకి నీరు చేరటం ఆగిపోతుంది. ఇంతవరకూ జరిగిన నష్టంతప్ప మెదడుకు పెద్దగా నష్టం జరగదు. శిశువు మల మూత్ర విసర్జన క్రమబద్ధమౌతుంది. ఎదుగుతున్నకొద్దీ నడవటం కూడా అలవాటు అవవచ్చు. ఆపరేషన్ చేయటం వల్ల 'షంట్' అవసరం ఉండదు.

"షంట్ అంటే?"

"మెదడులో చేరుతున్న నీటిని తొలగిస్తుండే ట్యూబ్ 'షంట్'. ఆపరేషన్ చేయకపోతే మెదడులోకి నీరు నిరంతరం చేరుతూనే ఉంటుంది. దానిని తొలగించేందుకు ఎప్పటికీ పాప శరీరంలో ఆ ట్యూబును ఉంచాలి. దాదాపుగా 80 శాతం స్పినాఫైడ్ పిల్లలకు షంట్ అవసరమౌతుంది".

డీన్, లెస్లీలు ఒకరివైపొకరు చూశారు.

వారిద్దరి కళ్లముందు ఒకే దృశ్యం కదలాడుతోంది. పసిపాప శరీరంలో జీవితాంతం ఓ ట్యూబు ఉండటం. మెదడులోకి చేరిన నీటిని అది బయటకు పంపిస్తుండటం. వారిద్దరినీ గమనిస్తూన్న డాక్టర్ మరో విషయం చెప్పింది.

"ఆపరేషన్‌వల్ల కొన్ని ప్రమాదాలూ ఉన్నాయి. ఆపరేషన్ విజయవంతం కాకపోవచ్చు. గర్భసంచీ విఛ్ఛిన్నం కావచ్చు. అందువల్ల పిండం మరణించవచ్చు. ఒక్కోసారి ఆపరేషన్ టేబిల్‌పైనే ప్రసవం జరగవచ్చు. ఆపరేషన్ వల్ల తల్లి ప్రాణానికీ ముప్పుంటుంది" మెల్లగా చెప్పింది డాక్టర్.

"మేం ఆలోచించుకోవాల్సి ఉంటుంది" అంది లెస్లీ.

తన భర్త మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడని ఆమె అర్థం చేసుకుంది.

* * *

"నాకేం చేయాలో తోచటం లేదు. ఇద్దరి ప్రాణాలు ప్రమాదంలో పడేయటం నాకు ఇష్టంలేదు" కోపంగా అన్నాడు డీన్.

అతడిది కోపం కాదని, నిస్సహాయత వల్ల జనించిన ఉక్రోషం అనీ అతని కళ్లల్లోని నీళ్లు స్పష్టం చేస్తున్నాయి.

లెస్లీ అతడిని దగ్గర తీసుకుంది.

"మునిగేవాడు గడ్డి పోచనయినా ఆధారంగా భావిస్తాడు. ప్రస్తుతం మనకు వేరేదారి లేదు. ఇదే ఇంకొన్ని ఏళ్ల ముందు అయి ఉంటే, ఇంత ఆశ కూడా ఉండేది కాదు. కాబట్టి మనం డాక్టర్ చెప్పినట్టు ఆపరేషన్ అనే గడ్డిపోచను పట్టుకుందాం" అనునయిస్తూ అంది.

"కానీ... పాపకు ఎలాగో సమస్య ఉంది. మనం పాపను పోగొట్టుకోటానికే సిద్ధమయ్యాం. కానీ పాపను రక్షించే ప్రయత్నంలో నీకేదయినా అయితే..." డీన్ ఇక మాట్లాడలేకపోయాడు.

ఆమె ఒళ్లో ముఖం దాచుకున్నాడు.

"భగవంతుడు మనకు ఓ అవకాశం ఇచ్చాడు. పాపను రక్షించుకునేందుకు ఓ మార్గం సూచించాడు. మనం మన అనుమానాలతో, భయాలతో అడుగు వెనక్కు వేస్తే ఆ అవకాశాన్ని కోల్పోతాం. భగవంతుడిపై భారం వేసి అడుగు ముందుకు వేద్దాం. ఆయన ఇచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది" స్థిరంగా అంది లెస్లీ.

"కానీ ఆపరేషన్ సక్సెస్ అవుతుందంటావా?" బేలగా అడిగాడు డీన్.

"మన చేతుల్లో ఏమీ లేనప్పుడు, భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియనప్పుడు, మనకు చేతనైన ప్రయత్నం మనం చేసి, ఆపై భగవంతుడిని ప్రార్థించాలి. అంతా ఆయనే చూసుకుంటాడు".

"చూసుకుంటాడంటావా?"

"చూద్దాం. భవిష్యత్తులో ఏమవుతుందో తెలిసిందొక్కడికే" అంది లెస్లీ నవ్వుతూ.

* * *

ఆపరేషన్ ఆరంభమైంది. లెస్లీ గర్భసంచీని శరీరంలోంచి వెలికి తీసింది డాక్టర్ బెస్‌నైర్. అయితే గర్భసంచికి లెస్లీ శరీరానికి రక్తనాళాల ద్వారా సంబంధం ఉంది. పిండం గుండె కొట్టుకుంటున్నట్టు అల్ట్రాసౌండ్ తెలుపుతోంది. అల్ట్రాసౌండ్‌లో కనిపిస్తున్న ప్రతిబింబం ఆధారంగా ఆపరేషన్ కొనసాగిస్తోంది డాక్టర్. నెమ్మదిగా గర్భసంచీని, అతి జాగ్రత్తగా పిండానికి దూరం చేసింది డాక్టర్. వెంటనే ఓ 'సిరంజీ'ని గర్భసంచీలోకి పంపింది. దీనిద్వారా 'ఉమ్మనీరు' వేగంగా బయటకు రాసాగింది. ఆపరేషన్ జట్టులోని ఇద్దరు గబగబా ఉమ్మనీటిని శరీర ఉష్ణోగ్రత ఉన్న ఇతర ట్యూబుల్లో భద్రపరచసాగారు.

**ఆపరేషన్ టేబిల్‌మీద నుంచి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి చేరిన వెంటనే లెస్లీకి నొప్పులు మొదలయ్యాయి. విశ్రాంతి తీసుకుంటున్న డాక్టర్లు, ఆపరేషన్ జట్టు గబగబా పరుగెత్తుకు వచ్చారు.**

ఎంతో నైపుణ్యంతో డాక్టర్ పిండం 'స్పినాఫైడ్ సాక్'ను చేరుకుంది. ఉమ్మనీరు లేకపోవటం వల్ల పిండం ప్రమాదంలో పడుతుంది. ఎటువంటి ప్రమాదం కలగకుండా శుభ్రపరచిన ఉప్పునీటిని పిండంపై చల్లుతున్నారు ఇతరులు.

ఆపరేషన్ జరపాల్సిన స్థలం కేవలం రెండు సెంటీమీటర్లు మాత్రమే. అందుకే ఆ ప్రదేశాన్ని పెద్దగా చేసి చూపించే పరికరాన్ని కళ్లకు ధరించింది బెస్‌నైర్. మైక్రోసిజర్లతో స్పినోఫైడా సాక్‌ను జాగ్రత్తగా కోసివేసింది. వెన్నుపూసను కప్పేటటువంటి, పక్కన పడి ఉన్న 'డ్యూరా' పొరలను నెమ్మదిగా తీసి వెన్నుపూసపై పరిచింది. పెద్దలలో ఈ 'డ్యూరా' చాలా కఠినంగా ఉంటుంది. కానీ 26 వారాల పిండం 'డ్యూరా' తడిసిన టిష్యూ కాగితం అంత మెత్తగా ఉంటుంది.

ఆపరేషన్ పూర్తయి పోయింది. దాంతో మళ్లీ నెమ్మదిగా గర్భాశయాన్ని దాని స్థానంలో జాగ్రత్తగా ఉంచింది. ఉమ్మనీటిని మళ్లీ గర్భాశయంలోకి ప్రవేశపెట్టింది. మిగతావారు ఆ ప్రాంతమంతా 'ఆంటిబయాటిక్'లు చల్లారు. ఆ తరువాత తాను చేసిన గాయాన్ని కుట్టేసింది. ఆపరేషన్ థియేటర్ బయటకు వస్తూ దీర్ఘంగా నిట్టూర్చింది డాక్టర్.



అమ్మానాన్నలు, అన్న, అక్కతో చిన్నారి గ్రేస్

* * *

ఆదివారం, డిసెంబర్ 16, 2001.

ఆపరేషన్ టేబిల్‌మీద నుంచి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి చేరిన వెంటనే లెస్లీకి నొప్పులు రావటం మొదలయ్యాయి. విశ్రాంతి తీసుకుంటున్న డాక్టర్లు, ఆపరేషన్ జట్టు గబగబా పరుగెత్తుకు వచ్చారు.

పెద్దగా కేకలు పెడుతూ 730 గ్రాముల బరువు మాత్రమే ఉన్న శిశువు భూమిపై అడుగిడింది.

ఇంత త్వరగా జన్మించిన శిశువులు బతకటం కష్టం. డాక్టర్లు హడావుడిగా పాపను సురక్షితం చేశారు. పాప పుట్టిన రెండురోజుల తరువాత గానీ ఆమె తల్లిదండ్రులు ఆమెని చూడలేకపోయారు.

ఎర్రగా చిన్న తేలు అంత ఉన్న పాపని చూసి వారి ఆశ్చర్యానికి అంతులేదు. 'పిట్ట కొంచెం కూత ఘనం' అన్నట్టు వేలంత లేని ఆ పాప మొత్తం హాస్పిటల్ అదిరేట్టు కేకలు పెడుతూ ఏడవటమేకాదు, కాళ్లతో గాలిని తంతోంది.

తల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు.

శిశువు, తల్లి ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. అసంభవమన్నది సంభవం అయింది. అద్భుతం ఇది! భగవంతుడి అద్భుతం ఇది!

ఇద్దరి కళ్లల్లో ఒకే భావం!

ఇద్దరూ ఒకేసారి అన్నారు- "భగవంతుడి గొప్పతనానికి, దయకు ప్రతిరూపం ఈ పాపం. ఈమెకు 'గ్రేస్' అని పేరు పెడదాం".

* * *

"అమ్మా! నాన్నగారు చెప్పటం లేదు. నిన్నే అడగమంటున్నారు" బుంగమూతి పెట్టుకుని అమ్మ దగ్గరకు వచ్చింది గ్రేస్.

జీవంతో ఉట్టిపడుతున్న గ్రేస్ అద్భుతమైన కళ్లల్లోకి చూస్తూ సర్వం మరిచిపోయింది లెస్లీ. నిజంగా భగవంతుడి ఉనికికి, గొప్పతనానికి రుజువులు అవసరమా? గ్రేస్‌ని ఎత్తుకుని ముద్దాడింది లెస్లీ.

"చెప్పమ్మా... దేవుడంటే ఎవరు?" మళ్లీ అడిగింది గ్రేస్.

"అదిగో ఆ బయట కనిపించే చెట్లు, కొండలు, వీచేగాలి, పారే నీరు, నువ్వు, నేను, మీ నాన్న ఇదంతా దేవుడే...! ముఖ్యంగా నువ్వే" అంటూ పాపని ముద్దాడింది లెస్లీ.

కిలకిల నవ్వింది గ్రేస్.